# మనం
## హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్

శనివారం | 6 | జూన్ | 2026 పేజీలు: 8




# చేప ప్రసాదం ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అజారుద్దీన్

హై దరాబాద్,జూన్ 05(మనం న్యూస్): ఈ నెల 8వ తేదీన ప్రారంభం కానున్న సాంప్రదాయ చేప మందు (ప్రసాదం) పంపిణీ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ శుక్రవారం పరిశీలించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ పనులను తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని ప్రతి ఏటా బత్తిని సోదరులు భక్తులకు అందించే ఈ చేప ప్రసాదం పంపిణీకి అత్యంత ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో మంత్రి అజారుద్దీన్ అధికారులతో కలిసి గ్రౌండ్‌లోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చేప ప్రసాదం కోసం దేశం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు హైదరాబాద్‌కు తరలివస్తారని,ఇక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు.



# పర్యావరణ పరిరక్షణ... ప్రతి ఒక్కరి బాధ్యత

### హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

2

పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్ లోఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మొక్కలు నాటడమే కాకుండా, 'చెట్టు విలువ తెలుసా' అనే పోస్టర్ను ఆవిష్కరించి, అందరితో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు.










### స్పా సెంటర్లపై పోలీసుల
# 'సర్జికల్ స్ట్రయిక్'

ఒకేసారి 113 చోట్ల దాడులు..

వణకిపోయిన నిర్వాహకులు!

నగర చరిత్రలోనే అతిపెద్ద ఆపరేషన్

ఏకంగా 500 మంది పోలీసులతో దాడి

3



# చెట్లను పెంచుదాం పర్యావరణాన్ని రక్షిద్దాం..

జస్టిస్ పి. సామ్ కోషి

పర్యావరణ పరిరక్షణ మనందరిపై ఉంది.

పర్యావరణం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.

నాంపల్లి క్రిమినల్ కోర్టుల ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు


2



# జిల్లాలో మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలి

రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

2



# పర్యావరణ పరిరక్షణ... ప్రతి ఒక్కరి బాధ్యత

**హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**







హైదరాబాద్,జూన్ 05(మనం న్యూస్)ః పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్ లోఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మొక్కలు నాటడమే కాకుండా, 'చెట్టు విలువ తెలుసా' అనే పోస్టర్ను ఆవిష్కరించి, అందరితో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఢిల్లీ తరహా కాలుష్య దుస్థితి తెలంగాణకు రాకూడదనే ఉద్దేశంతో



ముఖ్యమంత్రి రాష్ట్రంలో సున్నా టాక్స్‌తో ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీని తీసుకువచ్చారనితెలిపారు. మొక్కలు నాటడం కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, అందరి జీవితాల్లో భాగం కావాలన్నారు.రాష్ట్రంలో నిర్మించే 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో, ఖాళీ ప్రభుత్వ స్థలాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటాలని స్పష్టం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదు అని ఎవ్వరు అనుకోవద్దని..అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారు ఈరోజు కూడా మనము అది జ్ఞాపకం చేసుకుంటూ భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఒక్కరు విధిగా మొక్కను నాటాలని పొన్నం కోరారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ,హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు,మాజీ కార్పోరేటర్ చదువు నర్సింహా రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## చెట్లను పెంచుదాం పర్యావరణాన్ని రక్షిద్దాం.. జస్టిస్ పి. సామ్ కోషి

**పర్యావరణ పరిరక్షణ మనందరిపై ఉంది. పర్యావరణం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.**

**నాంపల్లి క్రిమినల్ కోర్టుల ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు**





హైదరాబాద్,జూన్ 05(మనం న్యూస్)ః ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హైదరాబాద్‌లోని నాంపల్లి క్రిమినల్ కోర్టుల ప్రాంగణంలో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞను చేయించారు. న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ పి. సామ్ కోషి మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పర్యావరణం అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంటోందని అన్నారు. వేగవంతమైన పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, సాంకేతిక అభివృద్ధి కారణంగా వాయు, జల కాలుష్యాలు పెరుగుతున్నాయని, వెంటనే చర్యలు తీసుకోకపోతే పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదం ఉందని సూచించారు.

**తగ్గుతున్న పచ్చదనంః**

హైదరాబాద్ నగరంతో సహా అనేక ప్రాంతాల్లో పచ్చదనం తగ్గిపోతూ కాంక్రీట్ నిర్మాణాలు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గతంతో పోలిస్తే వేసవికాలంలో ఉష్ణోగ్రతలు అధికమవడం, వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారడం వెనుక మానవ చర్యలే ప్రధాన కారణమని తెలిపారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ద్వారా మాత్రమే పర్యావరణ సమతుల్యతను కాపాడగలమని తెలిపారు. ఇంటి పరిసరాలు, కాలనీలు, విద్యాసంస్థలు, పిల్లలు ఆడుకునే ప్రదేశాలు సహా ప్రతి ప్రాంతంలో విస్తృత స్థాయిలో వృక్షరూప కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పచ్చదనం పెరిగితే పర్యావరణ నాణ్యత మరింత మెరుగుపడుతుందని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత

**- అత్తెల్లి అనంత్ రెడ్డి**



చేవెళ్ల, జూన్ 05 (మనం న్యూస్) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు ప్రధాని నరేంద్ర మోదీ పాలన సంబరాల్లో భాగంగా చేవెళ్ల గుండం వద్ద మొక్కలు నాటి, శ్రమదానం చేశారు.ఈ సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ 'అమ్మ పేరు మీద ఒక చెట్టు' నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వైభవ్ రెడ్డి, కుంచం శ్రీనివాస్, శర్వలింగం, అడెట్ల శ్రీనివాస్, జిల్లా సెక్రటరీ కృష్ణ గౌడ్, కౌన్సిలర్లు పెద్దోళ్ల దయాకర్, మనిషా అనంత్ రెడ్డి మరియు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలో మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలి

**రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా**



హైదరాబాద్,జూన్ 05(మనం న్యూస్)ః జిల్లాలో మెరుగైన రెవిన్యూ సేవలందాలని హైదరాబాద్ జిల్లా పాలనాధికారి డాక్టర్ ప్రియాంక అలా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ రెవెన్యూ అంశాలపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల సర్వే, డిజిటలైజేషన్, జిల్లా ల్యాండ్ బ్యాంక్ను ఆన్‌లైన్ డిజిటల్ పోర్టల్లో నిర్వహించడం, భూములకు సంబంధించిన సమాచారాన్ని నిరంతరం నవీకరించడం వంటి అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ భూములపై ఆక్రమణలు, ఎన్‌కంబ్రెన్సులు, కోర్టు కేసులు,ప్రభుత్వ భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వ భూముల లీజుల ద్వారా రావాల్సిన అద్దెల వసూళ్ల పురోగతిని కూడా సమీక్షించిన కలెక్టర్, బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.హైదరాబాద్ జిల్లాలో గృహ నిర్మాణ కార్యక్రమం అత్యంత ముఖ్యమైన అంశమని, గృహ నిర్మాణ పథకానికి సంబంధించిన అన్ని పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కదిరవన్ పలాని, జిల్లా రెవెన్యూ అధికారి నారాయణ, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ అశోక్ చక్రవర్తి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు, డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసిన కలెక్టర్



హైదరాబాద్,జూన్ 05(మనం న్యూస్)ః హైదరాబాద్ జిల్లాలోని వివిధ దినపత్రికలు, చానల్‌లలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ అర్హత మేరకు అక్రిడిటేషన్ కార్డులను అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అన్నారు. మొదటి విడత కార్డులకు సంబంధించి శుక్రవారం తన ఛాంబర్ లో కమిటీ సభ్యులు , పలు దినపత్రికలు, చానల్ల ప్రతినిధులకు అక్రిడేషన్ కార్డులను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దినపత్రికలు, చానల్ల వారీగా డిపిఆర్ఓ కార్యాలయం నుండి మొదటి విడత మంజూరైన కార్డులను పొందాలని సూచించారు. ఈ సందర్భంగా కార్డులు పొందిన ప్రతి ఒక్కరిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సహాయ సంచాలకులు మహమ్మద్ హబీబ్, డి ఈ వెంకట్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శంకర్ శిగ, నవీన్ కుమార్ యారా, మహమ్మద్ రఫియుద్దీన్ గౌరీ,కొమ్ము రాజు, మన్సూర్ అలీ , మోహనాచారి, దయానంద్, ప్రణీత , వివిధ పత్రికల స్టాఫ్ రిపోర్టర్లు కర్నాటి గోపీనాథ్ , సునీల్ కుమార్, మహమ్మద్ హమీద్ ఖాన్, రాజశేఖర్, మహేష్, మల్లేష్ బాబు, బాలకృష్ణ, ఉపేందర్, దయాకర్ కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్పా సెంటర్లపై పోలీసుల 'సర్జికల్ స్ట్రయిక్'

**ఒకేసారి 113 చోట్ల దాడులు.. వణికిపోయిన నిర్వాహకులు! నగర చరిత్రలోనే అతిపెద్ద ఆపరేషన్ ఏకంగా 500 మంది పోలీసులతో దాడి**



హైదరాబాద్,జూన్ 05(మనం న్యూస్): హైదరాబాద్ మహానగరంలో స్పా సెంటర్ల ముసుగులో సాగుతున్న అసాంఘిక దందాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం అత్యంత భారీస్థాయిలో మూకుమ్మడి దాడులు జరిగాయి. నగర చరిత్రలోనే అతిపెద్ద ఆపరేషన్‌లలో ఒకటిగా నిలిచిన ఈ దాడిలో ఏకంగా 500 మంది పోలీసులు ఒకేసారి రంగంలోకి దిగారు. మల్కాజ్గిరి పరిధిలోని సుమారు 113 స్పా సెంటర్లలో పోలీసులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. స్పా - మసాజ్ సెంటర్ల బోర్డుల వెనుక గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచారం, డ్రగ్స్ సహా ఇతర అసాంఘిక కార్యకలాపాల గుట్టును ఈ తనిఖీల్లో రట్టు చేశారు. ఈ నిబంధనల ఉల్లంఘనలపై పోలీసులు ఇప్పటివరకు 40కి పైగా కేసులు నమోదు చేయగా, నిర్వాహకులు, దళారులతో కలిపి మొత్తం 50 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో పోలీసులు కేవలం నిర్వాహకులపైనే కాకుండా, ఆయా స్పా సెంటర్లకు బిల్డింగ్లను అద్దెకు ఇస్తున్న యజమానులపై కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా పట్టించుకోని పలువురు ఇంటి యజమానులను పోలీసులు తీవ్రంగా విచారించారు. అద్దెకు ఇచ్చిన బిల్డింగులలో ఏం జరుగుతుందో తెలుసుకోవాల్సిన బాధ్యత మీపై లేదా? అని పోలీసులు ప్రశ్నించారు. ఈ దందాల గురించి తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టిన యజమానులపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నగరంలో ఇలాంటి అక్రమ కేంద్రాలపై నిరంతరం దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# మేస్త్రీలు-సెంట్రింగ్ కార్మికుల సమన్వయంతోనే నగరాభివృద్ధి

**సాయిజెన్ శేఖర్**

సికింద్రాబాద్, జూన్ 5 (మనం న్యూస్) భవన నిర్మాణ రంగంలో మేస్త్రీలు, సెంట్రింగ్ కార్మికులు, ఇతర నిర్మాణ కార్మికులందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే నగరాభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయిజెన్ శేఖర్ అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ట్రేడ్ యూనియన్ నాచారం డివిజన్ నాయకులు శుక్రవారం సాయిజెన్ శేఖర్ను మర్యాదపూర్వకంగా కలిసి, ఈ నెల 8న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ఆత్మగౌరవ సభకు మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన సాయిజెన్ శేఖర్, నిర్మాణ రంగ అభివృద్ధిలో మేస్త్రీల పాత్ర అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. 'మేస్త్రీ హరావో' వంటి నినాదాలు సమంజసం కావని, కార్మికుల మధ్య ఐక్యత, పరస్పర సహకారంతోనే నిర్మాణ రంగం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆత్మగౌరవ సభకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, సభ విజయవంతానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తన్నీరు శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు పీవీ సుబ్బారావు, యూనియన్ అధ్యక్షులు టి. కృష్ణ, ఉపాధ్యక్షులు కుంచాల శ్రీనివాసరావు, దిండి శీను, ప్రభాకర్, ఎం. మాధవ్ తదితరులు పాల్గొన్నారు.





# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ఎంపీ ఈటల రాజేందర్**





మేడ్చల్, జూన్ 4 ( మనం జిల్లా ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ రిజర్వ్ ఫారెస్ట్ లో హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ తో పాటు ఎమ్మెల్యే మల్లారెడ్డి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా జిల్లా అటవీ అధికారి వేణు మాధవరావు, ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి, జిల్లా స్థాయి అధికారులు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ సహజ వనరుల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రోజు రోజుకి అడు వులు అంతరించిపోతున్నాయని దీనివల్ల మానవాళి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. ప్రపంచ మనగడ కు చెట్లు ఎంతో అవసరమని, మానవాళి మనగలకు ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. నాటిన మొక్కలను కాపాడుకునే బాధ్యత మనపై ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో 17 పార్కులను అభివృద్ధి చేశానని దీనివల్ల ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందుతుందని తెలిపారు. మానవాళి మనగడకు చెట్లు ఎంతో అవసరమని కాబట్టి ప్రతి ఒక్కరు మొక్కల ను పర్యావరణ పరిరక్షణకు చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు భాస్కర్ యాదవ్, అఖిల్ నవీన్ రెడ్డి, ఇతర బిజెపి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సంక్షేమ హామీల అమలుకు చర్యలు చేపట్టాలి

**అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్..**

కాప్రా, జూన్ 5 (మనం న్యూస్): జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం కాప్రా సర్కిల్లోని కమలానగర్ కమ్యూనిటీ భవనంలో జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు ఎస్.కె. సలీమా, గుమ్మడి హరి ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని, హెల్త్ కార్డుల జారీతో పాటు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అలాగే జర్నలిస్టుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన ఇంటి స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలోని వందలాది మంది జర్నలిస్టులు, వారి కుటుంబాలకు టిడబ్ల్యూజేఎఫ్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని జిల్లా కార్యదర్శి బానోత్ రవి నాయక్ తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మడి రోజారాణి, సింగం రాజు, విష్ణు, సత్యనారాయణ, ఉస్సేన్, సహదేవ్, దుర్గాప్రసాద్, మోహన్ రెడ్డి, రజనీకాంత్, అరుణ్ కుమార్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

**కాంగ్రెస్ సీనియర్ నేతలు బిక్షపతి, సద్ది ప్రకాష్ రెడ్డి**

మేడ్చల్, జూన్ 5 ( మనం జిల్లా ప్రతినిధి): సీఎం సహాయ నిధి నిరుపేదలకు ఒక వరం లాంటిదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిక్షపతి, పెద్ది ప్రకాష్ రెడ్డి అన్నారు. సీఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.60 వేల చెక్కును బాధితురాలు మొండి రాధ కు కాంగ్రెస్ సీనియర్ నేతలు బిక్షపతి పెద్ది ప్రకాష్ రెడ్డిలు అందజేశారు. ఇటీవల మొండి రాధ భర్త మొండి వీరేష్ చనిపోవడం తో వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధులను అందజేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బ బాలేష్ అనిల్ హజిమ్ హమ్మద్ పాల్గొన్నారు





## ప్రపంచ రికార్డు సాధించిన షూటర్ ఇషా సింగ్కు ఎమ్మెల్యే ఘన సన్మానం

సికింద్రాబాద్, జూన్ 5 (మనం న్యూస్) హైదరాబాద్ కంటోన్మెంట్ రైల్వే కాలనీకి చెందిన ప్రముఖ భారత షూటర్ ఇషా సింగ్ అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఐఎస్ఎస్ఎఫ్ వరల్ కప్ మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో 43/50 స్కోర్ నమోదు చేసి కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పడంతో పాటు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విశిష్ట విజయాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆమెను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసిన ఆయన, అంతర్జాతీయ వేదికపై భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన ఇషా సింగ్ విజయం రాష్ట్ర యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడాకారులు ప్రపంచస్థాయిలో రాణించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. కష్టపడి సాధించిన ఈ విజయం తెలంగాణకే గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఇషా సింగ్కు శుభాకాంక్షలు తెలిపారు. ఇషా సింగ్ సాధించిన ప్రపంచ రికార్డు, స్వర్ణ పతకం భారత క్రీడా రంగానికి మరో మైలురాయిగా నిలిచిందని క్రీడా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సికింద్రాబాద్ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం విజయవంతం: పద్మారావు గౌడ్



సికింద్రాబాద్, జూన్ 5 (మనం న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గంలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తీగుళ్ల పద్మారావు గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ నాయకులు, నాయకురాళ్లు, మాజీ కార్పొరేటర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, యువజన, విద్యార్థి, కార్మిక విభాగాల నేతలు, పోలింగ్ బూత్, బస్తీ కమిటీల సభ్యులు, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, అలాగే బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ అభిమానులు అందించిన సహకారంతో సమావేశం ఘనవిజయం సాధించిందని పేర్కొన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్న ఈ సభను విజయవంతం చేయడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదే ఉత్సాహం, ఐక్యతతో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఓటు పరిరక్షణకు కృషి చేయాలని పద్మారావు గౌడ్ సూచించారు. సమావేశం విజయవంతం కావడం సికింద్రాబాద్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# చీఫ్ సెక్రటరీకి బంజారా సమస్యలు

**ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ**




హైదరాబాద్, జూన్ 5: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రతినిధి బృందం నేడు తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ గారిని కలిసి బంజారా గిరిజన సమాజానికి సంబంధించిన పలు కీలక సమస్యలపై వినతిపత్రం సమర్పించింది.

ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ గౌరవాధ్యక్షులు, శ్రీ అమర్ సింగ్ తిలావత్ గారి నాయకత్వంలో రాష్ట్ర అధ్యక్షులు మోహన్ సింగ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిషన్ నాయక్ రూపావత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బన్సి నాయక్,

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఏం రాములు నాయక్, రాష్ట్ర కార్యదర్శి పడిత్య నాయక్ బానోత్, విద్యార్థి సంఘ నాయకుడు భూక్య సాయి కుమార్ నాయక్, యువజన నాయకుడు వెంకట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతినిధి బృందం ప్రధానంగా మూడు ముఖ్యమైన అంశాలను చీఫ్ సెక్రటరీ గారి దృష్టికి తీసుకెళ్లింది.

1. డీలిమిటేషన్ ప్రక్రియ సక్రమంగా అమలు చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న డీలిమిటేషన్ ప్రక్రియలో గిరిజన ప్రాంతాల సామాజిక, భౌగోళిక మరియు పరిపాలనా వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. గిరిజన జనాభా ప్రయోజనాలు దెబ్బతినకుండా నియోజకవర్గాలు మరియు స్థానిక సంస్థల పునర్విభజన జరగాలని విజ్ఞప్తి చేశారు.

2. హైదరాబాద్ మరియు మైదాన ప్రాంతాలలో ఐటీడీఏ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

ప్రస్తుతం గిరిజనుల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఐటీడీఏ వ్యవస్థ ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతాలకు పరిమితమైందని, అయితే హైదరాబాద్ మహానగరం, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాలు మరియు రాష్ట్రంలోని మైదాన ప్రాంతాలలో కూడా పెద్ద సంఖ్యలో బంజారా గిరిజనులు నివసిస్తున్నారని వివరించారు.

ఈ నేపథ్యంలో హైదరాబాద్తో పాటు మైదాన ప్రాంతాల్లో ప్రత్యేక ఐటీడీఏ కార్యాలయాలను ఏర్పాటు చేసి గిరిజనులకు విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు మరియు పరిపాలనా సేవలు సులభంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

3. ఎస్టీ కమ్యూనిటీ ధృవీకరణ పత్రాల జారీకి 16 ఆగస్టు 1977 ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలి

బంజారా, లంబాడి గిరిజనులకు ఎస్టీ కమ్యూనిటీ ధృవీకరణ పత్రాల జారీ విషయంలో అధికారులు అనవసరంగా 1952 సంవత్సరానికి పూర్వం సంబంధించిన ఆధారాలను కోరుతూ గిరిజనులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రతినిధి బృందం వివరించింది. భారత ప్రభుత్వం 16 ఆగస్టు 1977న లంబాడి/బంజారా సమాజాన్ని షెడ్యూల్ ట్రైబ్ జాబితాలో చేర్చిన నేపథ్యంలో, ఆ తేదీ నుండి స్థానిక నివాస మరియు కుటుంబ ఆధారాలను పరిగణనలోకి తీసుకొని కమ్యూనిటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల నాటి రికార్డులను సమర్పించడం పేద గిరిజన నిరక్షరాస్యుల కుటుంబాలకు సాధ్యం కాదని, దీనివల్ల విద్య, ఉద్యోగాలు మరియు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ మూడు అంశాలపై సమగ్రంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ గారికి వినతిపత్రం సమర్పించారు.

ప్రభుత్వం గిరిజనుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ కోరింది.

# పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో అవసరం

**ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి**




మేడ్చల్, జూన్ 5 ( మనం జిల్లా ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంత అవసరమని ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడానికి స్వచ్ఛమైన, పచ్చని పర్యావరణం యొక్క ప్రాముఖ్యత గురించి పౌరులలో అవగాహన కల్పించడానికి ఎల్లంపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, గాలి నాణ్యతను మెరుగుపరచడంలో, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.పట్టణాన్ని మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా మార్చడంలో తమ వంతు సహకారం అందించాలని పౌరులను కోరారు.పచ్చదనాన్ని పెంచడం పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని వ్యాప్తి చేయడం అనే లక్ష్యంతో ఈ మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామన్నారు.. భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించడానికి తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి వైస్ చైర్పర్సన్, కౌన్సిలర్లు, స్వయం సహాయక బృందాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



**బండ మాదారంలో...**

ఎల్లంపేట మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు ఎక్కల్ దేవి శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో బండ మాదారం లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లంపేట్ గౌరారం జగన్ గౌడ్ ఎల్లంపేట్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రజిత దేవేందర్ రెడ్డి కార్యక్రమ కన్వీనర్ పోచయ్య ముదిరాజ్,మహేష్ ఉషాగారి బాబు సిహెచ్ రవీందర్ కుర్మా ఆంజనేయులు గణేష్ ఆనంద్ భూపాల్ శ్రీశైలం కృష్ణ రవిచంద్ర పద్మారావు రవి బాబు రాములు తదితరులు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.

# పార్టీ అధిష్టానం పై మల్లన్న అలక?

**పార్టీ మారుతున్నట్లు ఊపందుకున్న ఊహాగానాలు**

**పార్టీ కార్యక్రమాలకు ఎమ్మెల్యే మల్లారెడ్డి దూరం**

**బిఆర్ఎస్‌లో ఏం జరుగుతుంది**






మేడ్చల్, జూన్ 5 ( మనం జిల్లా ప్రతినిధి): బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం పై మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అలక బూనినట్లు తెలుస్తుంది. అధికార పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ పార్టీ అధిష్టానం కు ఎమ్మెల్యే మల్లారెడ్డి దూరంగా ఉంటున్నట్లు సమాచారం. ఇటీవల మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో జరిగిన ఉమ్మడి మండల కార్యకర్తల సమావేశాలకు ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరు కాకపోవడం తో అనుమానాలు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. ఇటీవల మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో సభ్యత్వ నమోదు కార్యక్రమం తో పాటు ఉమ్మడి మండల కార్యకర్తల సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్యే మల్లారెడ్డి దూరంగా ఉన్నారు. ఈ సమావేశాలకు ఆయన పెద్ద కొడుకు చామకూర మహేందర్ రెడ్డిని పంపించారే తప్ప ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరు కాలేదు. దీంతో ఎమ్మెల్యే మల్లారెడ్డి పార్టీ అధిష్టానం పై అలక బూనినట్లు జిల్లాలో చర్చించుకుంటున్నారు.

**బిజెపిలో మల్లారెడ్డి చేరుతున్నట్టు జోరుగా ప్రచారం**

బిజెపిలో మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చేరుతున్నట్లు ఇటీవల జోరుగా ప్రచారం సాగింది. ఇటీవల ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు ఆ పార్టీ పెద్ద నాయకులను ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆయన కొడుకు కోడలు కలిసి నట్లు పెద్ద ఎత్తున చర్చలు సాగాయి. అయితే వీటిని ఎమ్మెల్యే మల్లారెడ్డి ఖండించినప్పటికీ ఊహాగానాలు మాత్రం ఆగలేదు. అంతేకాకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం రెండు పడవల మీద ప్రయాణం ప్రమాదం అంటూ.. ఉంటే బి ఆర్ ఎస్ లోనే ఉండు లేదంటే బిజెపి లోకి అయినా వెళ్ళొచ్చు అంటూ బహిరంగంగా క్లాస్ ఇవ్వడంతో ఎమ్మెల్యే మల్లారెడ్డి బిజెపిలోకి వెళ్తున్నాడు అంటూ ఊహాగానాలకు బలం చేకూర్చాయి.అప్పటి నుండి ఎమ్మెల్యే మల్లారెడ్డి పార్టీ అధిష్టానం పై అలక భూని నట్లు జిల్లాలో జోరుగా చర్చలు సాగుతున్నాయి. అయితే ఇక్కడ మరో ట్విస్ట్ కూడా ఉంది. ఎమ్మెల్యే మల్లారెడ్డి బిజెపిలోకి చేరుతున్నట్లు ఊహాగానాలు వస్తున్నప్పటికీ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాత్రం ఎక్కడ ఈ విషయంలో నోరు విప్పలేదు. ప్రతిసారి విలేకరులు ఈ విషయంపై ప్రశ్నించినప్పటికీ అలాంటివి ఏమీ లేదు.. తాను బిఆర్ఎస్ లోనే ఉన్నాను.. ఉంటాను అంటూ... సమాధానం ఇచ్చుకుంటూ వచ్చారు.

**మల్లారెడ్డిని పార్టీ వద్దనుకుంటుందా?**

మల్లారెడ్డి ని బిఆర్ఎస్ అధిష్టానం పక్కన పెట్టిందా అంటే ఆ పార్టీ శ్రేణుల నుండి అవుననే సమాధానం వస్తుంది. ఇందుకు నిదర్శనం ఇటీవల జరిగిన సంఘటన నే అని తెలుస్తుంది. జిల్లాలోని ద్వితీయ శ్రేణి క్యాడర్ ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలిపించుకొని మాట్లాడినట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి కి పార్టీ అధిష్టానం నుండి పిలుపు అందనట్లు తెలుస్తుంది. జిల్లాలో ఇటీవల ఎంపికైన బిఆర్ఎస్ కౌన్సిలర్లతో పాటు ఆ పార్టీ ద్వితీయ శ్రేణులతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం అయినట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే మల్లారెడ్డి కి సమాచారం ఇవ్వకుండా ఆ పార్టీ కౌన్సిలర్లను, ద్వితీయ శ్రేణి నేతలను కేటీఆర్ పిలిపించుకొని మాట్లాడడం తో అనుమానాలు మరింత బలపడ్డాయి. పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే మల్లారెడ్డిని దూరం పెడుతుందని జిల్లాలో జోరుగా చర్చలు సాగుతున్నాయి..

**మల్లారెడ్డిని పార్టీ వద్దనుకుంటుందా... పార్టీని మల్లారెడ్డి వద్దకుకుంటున్నారా?**

ఎమ్మెల్యే మల్లారెడ్డిని బి ఆర్ ఎస్ పార్టీ వద్దనుకుంటుందా... లేక ఎమ్మెల్యే మల్లారెడ్డే పార్టీని వద్దనుకుంటున్నారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. పార్టీ నుండి ఎప్పుడు పంపిస్తారా అని మల్లారెడ్డి.. పార్టీ నుండి మల్లారెడ్డి స్వయంగా ఎప్పుడు వెళ్ళిపోతారా అని పార్టీ అధిష్టానం చూస్తుంది అంటూ జిల్లాలో జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఏది ఏమైనా ఎమ్మెల్యే మల్లారెడ్డి పార్టీ మారుతున్నట్లు వస్తున్న ఊహాగానాలు జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది.





## ప్రైవేట్ స్కూళ్లలో అక్రమ పుస్తకాల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

**డీఈఓకు ఓయూ విద్యార్థి సంఘాల వినతి**

సికింద్రాబాద్, జూన్ 5 (మనం న్యూస్) హైదరాబాద్ జిల్లా మారేడ్పల్లి మండల పరిధితో పాటు హైదరాబాద్ నగర వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా పుస్తకాలు, స్టేషనరీ, ఇతర విద్యా సామగ్రి విక్రయాలు నిర్వహిస్తున్నాయని ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా డీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ మార్గదర్శకాలు, విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ-2009), ప్రభుత్వ జీవో నంబర్-1 స్ఫూర్తికి విరుద్ధంగా కొన్ని పాఠశాలలు తల్లిదండ్రులను నిర్దిష్ట విక్రేతల వద్ద నుంచే పుస్తకాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలు తమ ప్రాంగణాల్లో లేదా తమ ఆధ్వర్యంలో పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ విక్రయించరాదని, తల్లిదండ్రులకు తమకు నచ్చిన దుకాణం నుంచి కొనుగోలు చేసే హక్కు ఉందని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయాలని, పునరావృతమైతే గుర్తింపు రద్దు సహా చట్టపరమైన చర్యలు చేపట్టాలని డీఈఓను కోరారు. కార్యక్రమంలో గద్దల అంజిబాబు, జంగిలి దర్శన్, కొమ్ము శేఖర్ మాదిగ, జక్కుల మధు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కవచ్‌లో విస్తృత వాహన తనిఖీలు

**నిబంధనలు ఉల్లంఘించిన 69 వాహనాలపై చర్యలు..**



ఏసీపీ కె. శశాంక్ రెడ్డి, వారసిగూడ ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్, చిలకలగూడ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, లాలాగూడ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, చిలకలగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జగన్ రెడ్డి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సికింద్రాబాద్, జూన్ 5 (మనం న్యూస్) నగరంలో శాంతిభద్రతలు, రోడ్డు భద్రతను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా పోలీసు శాఖ చేపడుతున్న 'ఆపరేషన్ కవచ్' కార్యక్రమంలో భాగంగా పార్సిగుట్ట, సీతాఫల్మండి, లాలాగూడ ప్రాంతాల్లో పోలీసులు విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. జూన్ 4వ తేదీ రాత్రి 9:30 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అంబేద్కర్ విగ్రహం సమీపంలో ప్రత్యేక వాహన తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా లేదా స్పష్టంగా కనిపించని నెంబర్లతో ఉన్న వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీల్లో మొత్తం 69 వాహనాలను గుర్తించి డిటైన్ చేసి, ఆయా వాహన యజమానులపై ట్రాఫిక్ నిబంధనల మేరకు జరిమానాలు విధించారు. వాహనదారులు చట్టబద్ధమైన నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమాన్ని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ లావణ్య పర్యవేక్షించారు. పౌరుల భద్రత, నేరాల నియంత్రణ కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో చిలకలగూడ

## పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ



మేడ్చల్, జూన్ 5 ( మనం జిల్లా ప్రతినిధి): పర్యావరణాన్ని కాపాడుతామంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఇదేవిధంగా చిన్నారులు జైని ఈశాన్యని విద్యార్థులతో కలిసి పూల మొక్కలు నాటారు. పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మా ఇంటి పైన మా మనుమరాళ్ళు, జైని ఈశాన్వని, ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పూల మొక్కలు నాటడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులచే పర్యావరణాన్ని కాపాడుతామంటూ విద్యార్థులచే ప్రమాణం ప్రతిజ్ఞ చేయించామని తెలిపారు.పర్యావరణాన్ని కాపాడుతామని, ప్లాస్టిక్ కవర్ వాడమని నీటిని పొదుపుగా వాడుతామని,ప్లాస్టిక్ ఇస్తరాకులు వాడమని, మోదుగ, అరటి, స్టీల్ ప్లేట్లు,చేతి సంచులు వాడతామని,మేము మా ఇంట్లో మా పెద్దలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామని విద్యార్థులు ప్రమాణం చేయడం జరిగిందన్నా రు.ఈ కార్యక్రమంలో సామాజిక పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్,వేణు,భప్పు, బాలు,డ్రైవర్ శివ,గోపాల్,రాజు, మొదలగువారు పాల్గొన్నారు,



# 717 సర్వేనెంబర్‌పై సమగ్ర విచారణ జరపాలి

మేడ్చల్, జూన్ 5 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని డబిలిపూర్ గ్రామంలో 717 సర్వేనెంబర్ పై సమగ్ర విచారణ జరిపించాలని ఆ సర్వే నెంబర్ పట్టాదారుడు జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు. 716 సర్వే నెంబర్లు చేపట్టాల్సిన భవనాన్ని 717లో చేపడుతూ అక్రమానికి పాల్పడుతున్నారని ఆయనే జిల్లా కలెక్టర్ కు తెలిపారు. అంతేకాకుండా ఈ వివాదం పై కోర్టును ఆశించగా నిర్మాణ పనులు నిలుపుదల చేయాలంటూ కోర్టు ఆదేశించిందని అయినా పనులను చేపడుతూ కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారని, ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలంటూ 717 సర్వేనెంబర్ పట్టాదారులు కోరుతున్నారు.

# ఎమ్మెల్యే వేముల వీరేశంపై విమర్శలు తగవు

: డా. వలిగొండ నరసింహ..




సికింద్రాబాద్, జూన్ 5 (మనం న్యూస్) నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రజానాయకుడు వేముల వీరేశంపై బీఆర్ఎస్ నాయకుడు చిరుమర్తి లింగయ్య చేసిన వ్యాఖ్యలను ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన విద్యార్థి నాయకుడు డా. వలిగొండ నరసింహ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం నుంచి ప్రజా సమస్యల పరిష్కారం వరకు వేముల వీరేశం నిరంతరం ప్రజల పక్షాన పోరాడిన నాయకుడని పేర్కొన్నారు. వీరేశం రాజకీయ జీవితం పారదర్శకంగా సాగిందని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఉద్యమ సమయంలో అనేక ఇబ్బందులు, అరెస్టులు, కేసులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా తెలంగాణ కోసం పోరాడారని గుర్తుచేశారు. ప్రజా గాయని, తెలంగాణ ఉద్యమ నాయకురాలు వేముల పుష్పపై చేసిన వ్యాఖ్యలు కూడా బాధాకరమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆమె చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ప్రజా బలం కలిగిన నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని, రాజకీయాల్లో విలువలు, సంస్కారం పాటించాలని డా. నరసింహ సూచించారు. వేముల వీరేశం సిద్ధాంతాలు, క్రమశిక్షణ, ప్రజాసేవకు కట్టుబడి ఉన్న నాయకుడని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న పోరాటానికి ప్రజల మద్దతు కొనసాగుతుందని తెలిపారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవంతో వ్యవహరించాలని, వ్యక్తిగత ఆరోపణలు మానుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# దక్షిణ మధ్య రైల్వేలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**ఉద్యోగుల పిల్లలకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల నిర్వహణ.. వాతావరణ మార్పుల సవాళ్లపై అవగాహన కల్పించిన రైల్వే అధికారులు..**




సికింద్రాబాద్, జూన్ 5 (మనం న్యూస్) ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026ను దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం సికింద్రాబాద్లోని ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధాన విభాగాధిపతులు, డివిజనల్ రైల్వే మేనేజర్లు, సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, రైల్వే మంత్రిత్వ శాఖ చేపట్టిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రచారంలో దక్షిణ మధ్య రైల్వే చురుకుగా భాగస్వామ్యమైందన్నారు. మే 15 నుంచి జూన్ 5 వరకు వాతావరణ మార్పు - భూమాత ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ట్రాక్ల విద్యుదీకరణ, పునరుత్పాదక శక్తి వినియోగం, నీటి సంరక్షణ, చెట్ల పెంపకం, వనరుల సుస్థిర వినియోగం వంటి చర్యలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్ మాట్లాడుతూ, జోన్ వ్యాప్తంగా నిర్వహించిన పర్యావరణ కార్యక్రమాల్లో అన్ని విభాగాలు ఉత్సాహంగా పాల్గొన్నాయని తెలిపారు. ఇంధన పొదుపు, హరిత కార్యక్రమాలు, మొక్కల పెంపకంలో విశేష పురోగతి సాధించినట్లు వెల్లడించారు. రాబోయే తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్, సికింద్రాబాద్, నాందేడ్ డివిజన్ల అధికారులు పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, 'ఏక్ పెడ్ మా కే నామ్' మొక్కల పెంపకం, నీరు-ఇంధన సంరక్షణ చర్యలపై నివేదికలు సమర్పించారు. వాతావరణ మార్పు - భూమాత ఎదుర్కొంటున్న సవాళ్లు అంశంపై రైల్వే ఉద్యోగుల పిల్లలకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల విజేతలకు జనరల్ మేనేజర్ జ్ఞాపికలు అందజేశారు. అనంతరం రైల్వే బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈఓ సతీష్ కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణను రోజువారీ విధుల్లో భాగంగా మార్చుకోవాలని, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ నిరంతరం ఆచరించాలని పిలుపునిచ్చారు.






# పచ్చదనం పెంపే భూమి రక్షణకు మార్గం

: ఎమ్మెల్యే శ్రీగణేష్..

సికింద్రాబాద్, జూన్ 5 (మనం న్యూస్) ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మారేడుపల్లిలోని నెహ్రూ నగర్ పార్కులో శుక్రవారం ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీగణేష్ మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూమి మన ఇల్లు కాగా ప్రకృతి మన జీవనాధారమని పేర్కొన్నారు. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్య ప్రభావం నుంచి భూమిని కాపాడుకోవాలంటే పచ్చదనాన్ని పెంపొందించడం ఒక్కటే మార్గమని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. భావితరాలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించాలంటే ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా అవి వృక్షాలుగా ఎదిగే వరకు బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రకృతిని గౌరవిస్తూ పచ్చని, స్వచ్ఛమైన కంటోన్మెంట్ నిర్మాణానికి ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బోయిన్పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్, డివిజన్ అధ్యక్షులు నగేష్ యాదవ్, బద్రి యాదవ్, సంతోష్ యాదవ్, వైష్ణవి యాదవ్, శ్రీనాథ్, అరవింద్ యాదవ్తో పాటు స్థానిక నాయకులు, కాలనీ వాసులు, పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.



# యువతలో కళా ప్రతిభకు వేదికగా ప్రవీణ్ డ్యాన్స్ కంపెనీ - 4వ వార్షికోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి..

ఏఎస్ రావు నగర్, జూన్ 5 (మనం న్యూస్): డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని నార్త్ కమలానగర్లో ఉన్న ప్రవీణ్ డ్యాన్స్ కంపెనీ (పిడిసి) 4వ వార్షికోత్సవ వేడుకలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతలోని ప్రతిభను వెలికితీసి కళలకు ప్రోత్సాహం అందిస్తున్న ప్రవీణ్ డ్యాన్స్ కంపెనీ నిర్వాహకులు అభినందనీయులని పేర్కొన్నారు. నృత్య కళ యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందిస్తుందని అన్నారు. నాలుగు సంవత్సరాలుగా సంస్థను విజయవంతంగా నిర్వహిస్తూ అనేక మంది యువ కళాకారులను తీర్చిదిద్దుతున్న కొరియోగ్రాఫర్ ప్రవీణ్ను ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమానికి హాజరైన కళాకారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వార్షికోత్సవ కేక్ను కట్ చేసి వేడుకలను ప్రారంభించిన ఎమ్మెల్యే, విద్యార్థుల నృత్య ప్రదర్శనలను వీక్షించి వారిని అభినందించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పార్టీ నాయకులు మహేష్ గౌడ్, ఆకుల మహేందర్, కార్యకర్తలు, కళాకారులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# మహిళలకు ప్రభుత్వ గ్రీన్ గిఫ్ట్

**ఎస్హెచ్జీ సభ్యులకు పార్కుల నిర్వహణ బాధ్యతలు**
**కాంట్రాక్టర్లకు బదులు మహిళలు..**
**పార్కుల నిర్వహణలో కొత్త అధ్యాయం**

మేడ్చల్, జూన్ 5 ( మనం జిల్లా ప్రతినిధి ): మహిళల ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేయడం, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడం లక్ష్యంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పార్కుల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ఈ కార్యక్రమంలో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా ఎంఎంసి పరిధిలోని ప్రతి జోన్లో కనీసం రెండు పార్కులను స్వయం సహాయక సంఘం మహిళలకు నిర్వహణ కోసం కేటాయించడం జరిగింది. ఈ నేపథ్యంలో ఎల్బీ నగర్ జోన్ పరిధిలోని రెండు పార్కులను స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు.

**ఎల్ బి నగర్ జోన్ లో**

సర్కిల్-12, సరూర్నగర్ పరిధిలోని హుడా సి-టైప్ పార్క్ నిర్వహణను జన్మభూమి ఎంపీఎస్ స్వయం సహాయక సంఘానికి అప్పగించారు. అదేవిధంగా సర్కిల్-14, హయత్నగర్ పరిధిలోని యశోద ఎన్క్లేవ్ కాలనీ పార్క్ నిర్వహణను ఆదర్శ ఎంపీఎస్ స్వయం సహాయక సంఘానికి అప్పగించారు.



**ఉప్పల్ జోన్ లో**

ఉప్పల్ సర్కిల్ చిలుకనగర్ వార్డు లోని బ్యాంక్ కాలనీ పార్కు వేంకటేశ్వర స్వామి ఎస్ హెచ్ జి, జీవన జ్యోతి ఎస్ హెచ్ జి, సైలాన్ బాబా ఎస్ హెచ్ జి లకు అప్పగించారు. నాచారం సర్కిల్ శక్తి సాయి నగర్ లోని గోకుల్ నగర్ కాలనీ పార్కు మునీర ఎస్ హెచ్ జి కు అప్పగించారు.

**మల్కాజ్ గిరి జోన్ లో**

కీసర సర్కిల్ లోని ప్రశాంత్ విహార్ కాలనీ పార్క్ మల్లన్న స్వయం సహాయక సంఘానికి, సాయి కృష్ణా ఎన్క్లేవ్ పార్కు వారాహి స్వయం సహాయక సంఘానికి అప్పగించారు.

అదే విధంగా అల్వాల్ సర్కిల్ లోని భూదేవి నగర్ పార్కు విజయ గణపతి స్వయం సహాయక సంఘానికి, బోయిన్ పల్లి సర్కిల్ లోని నెహ్రూ నగర్ పార్కు నాగ శ్రీ స్వయం సహాయక సంఘానికి అప్పగించారు.పార్కుల నిర్వహణలో భాగంగా పరిశుభ్రత, మొక్కల సంరక్షణ, నీటి సరఫరా, ఉద్యానవన నిర్వహణ తదితర రోజువారీ పనులను ఆయా ఎస్ హెచ్ జి మహిళలే నిర్వహించనున్నారు. ఈ పనులు యూబీడీ సిబ్బంది సాంకేతిక మార్గదర్శకత్వంలో కొనసాగుతాయి. ఈ పైలట్ ప్రాజెక్టులో మహిళల పనితీరు సంతృప్తికరంగా ఉంటే, ప్రస్తుతం కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇతర పార్కులను కూడా దశలవారీగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

ప్రాజెక్ట్ డైరెక్టర్, అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్, డీపీఓలు తరచూ పార్కులను సందర్శించి పనితీరును పర్యవేక్షించనున్నారు. మహిళలను ప్రోత్సహించేందుకు ఈ పైలట్ ప్రాజెక్టులో పాల్గొనే స్వయం సహాయక సంఘాలకు ఈఎండీ, జీఎస్టీ, లేబర్ లైసెన్స్ తదితర రుసుముల నుంచి ప్రభుత్వం మినహాయింపు కల్పించింది.

**పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన అధికారులు**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 92వ రోజు సందర్భంగా శుక్రవారం రోజున ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భారీ స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు మొక్కల నాటే కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టి రహదారులు, కాలనీలు, పార్కులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రపరిచారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎం ఎం సి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు నగర పరిశుభ్రతతో పాటు పచ్చదనం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని యుబిడి డైరెక్టర్ సునంద తెలిపారు.

# నీటిని దొంగలించేందుకు యత్నం... అడ్డుకున్న అధికారులు

**పూడూరులో ఘటన**

మేడ్చల్, జూన్ 5 ( మనం జిల్లా ప్రతినిధి): తన వ్యవసాయ భూమిలో బోరు పడలేదు అంటూ.. శామీర్పేట్ చెరువు నుండి నీటిని దొంగలించేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తి పన్నాగాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు విఫలం చేశారు. తన వ్యవసాయ భూమిలో బోరు పడలేదు అంటూ శామీర్పేట్ చెరువు నీటిని దొంగతనంగా తరలించేందుకు ఓ వ్యక్తి రాత్రికి రాత్రి పైప్ లైన్ వేసేందుకు ప్రయత్నిస్తుండగా దీనిని పసిగట్టిన ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. పూడూరులోని 312 సర్వే నెంబర్ లో ఉన్న ఓ ఎకరం భూమిలో సాగు చేసుకునేందుకు బోరు వేశానని అయితే ఆ బోరు ఫెయిల్ కావడంతో సమీపంలో ఉన్న శామీర్పేట్ చెరువు నుండి పైపు లేని ద్వారా నీటిని తీసుకోవాలని పన్నాగం పన్నాడు. తనకు వచ్చిన ఈ ఆలోచనను అమల్లో పెట్టేందుకు షామీర్పేట్ చెరువు నుండి తన వ్యవసాయ భూమి 8 ఫీట్ల లోతు, 2ఫీట్ల వెడల్పు తో భారీ కాల్వను తవ్వి అందులో నుండి పైప్ లైన్ ద్వారా నీటిని తరలించుకునేందుకు రాత్రికి రాత్రి పథకం



వేశాడు. రెవెన్యూ అధికారుల నుండి గాని, ఇరిగేషన్ అధికారుల నుండి గాని ఎలాంటి అనుమతులు ఈ పనులకు శ్రీకారం చుట్టాడు. ఇంకేముంది ఈ విషయం అధికారులకు తెలియడంతో వారు రంగ ప్రవేశం చేశారు

**పైప్ లైన్ ను ధ్వంసం చేసిన అధికారులు**

పూడూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని శామీర్ పేట చెరువులో నుండి అక్రమంగా భారీ కాలువ తవ్వి పైప్ లైన్ ద్వారా నీటిని తరలిస్తున్న ఓ ప్రయివేట్ వ్యక్తికి చెందిన పైప్ లైన్ ను ఇరిగేషన్,రెవెన్యూ అధికారులు. ధ్వంసం చేశారు. ఇరిగేషన్,రెవెన్యూ శాఖల నుండి



ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా శామీర్ పేట పెద్ద చెరువు నుండి ఓ ప్రయివేటు వ్యక్తి నీటిని తరలిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం రెవిన్యూ ఇన్స్పెక్టర్ చందన్ రెడ్డి,జీపీఓ సునీత,ఇరిగేషన్ ఇన్స్పెక్టర్ ఈర్షద్,రెవెన్యూ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని అక్రమంగా ఓ ప్రయివేట్ వ్యక్తి తన వ్యవసాయ క్షేత్రంలోకి వేసిన పైప్ లైన్ నిర్మాణాలను పరిశీలించి ధ్వంసం చేశారు.



# ఘనంగా కాంగ్రెస్,బిఆర్ఎస్ నేతల జన్మదిన వేడుకలు

**బిఆర్ఎస్ సీనియర్ నేత మద్దుల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత గువ్వ రవి ముదిరాజ్ జన్మదిన వేడుకలు**

మేడ్చల్, జూన్ 5 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ జిల్లాకు చెందిన బిఆర్ఎస్ సీనియర్ నేత మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి తన జన్మదినం సందర్భంగా పలు దేవాలయాలను దర్శించుకుని బర్త్డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్ కండ్లకోయలోని ఓ ఫంక్షన్ హాల్ లో జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి మాజీ డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు జన్మదిన వేడుకలో పాల్గొని గువ్వ రవి ముదిరాజ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# చేవెళ్లలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**
**పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుంది**
**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**

చేవెళ్ల, జూన్ 5 (మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల మున్సిపాలిటీ 14 వ వార్డ్ పరిధిలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల సందర్భంగా మొక్కలు నాటిన ప్రజా ప్రతినిధులు, అధికారులు చేవెళ్ళ మునిసిపాలిటీ : 05 జూన్,2026 తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' (99 రోజుల కార్యాచరణ) లో భాగంగా నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.చేవెళ్ల



చైర్పర్సన్ శ్రీమతి సమత వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన

ఈ కార్యక్రమానికి గౌరవనీయులైన స్థానిక శాసనసభ్యులు కాలె యాదయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో, పరిసర ప్రాంతాలలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి,వైస్ చైర్ పర్సన్ రాములుగౌడ్, 14వ వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, కౌన్సిలర్స్, ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ గలీజ్ దందాను ఇక్కడి నుండి తరలించండి

**పోలీసులను వేడుకుంటున్న ఉమా నగర్ వాసులు వ్యభిచారం దందాతో ఈ ప్రాంత వాతావరణ కలిసితమవుతుందని ఆరోపణ**






మేడ్చల్, జూన్ 5 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ పట్టణం ఉమా నగర్ లో సాగుతున్న ఈ గలీజ్ దందా ను ఇక్కడి నుండి తరలించాలి అంటూ ఆ కాలనీవాసులు పోలీసులను కోరుతున్నారు. ఉదయం 9 గంటల నుండి అర్ధరాత్రి వరకు ఈ ప్రాంతంలో మహిళలు వ్యభిచారం చేస్తున్నాడంవల్ల ఈ ప్రాంతం కలుషితమవుతుందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. విటుల కోసం కొట్టు కోవడాలు... విటుల ను ఆకర్షించేందుకు వెకిలి చేష్టలు చేస్తూ ఈ ప్రాంత వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతం నుండి విద్యార్థులు విద్యార్థినిలు కళాశాలకు వెళుతూ ఉంటారని వీరి వెక్కిలి చేష్టల వల్ల విద్యార్థినీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఇక్కడి నుంచి ఈ దందాను తొలగించాలి అంటూ గతంలో పలుమార్లు పోలీస్ అధికారులకు ఫిర్యాదులు సైతం చేశామని ... పోలీసులు రావడం... యువతులను బెదిరించడం... పోలీసులు వెళ్లాక మళ్లీ యధావిధిగా దందా కొనసాగించడం జరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. అలా కాకుండా శాశ్వతంగా ఈ గలీజ్ దందాను ఇక్కడి నుండి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

**పత్రికల్లో కథనాలు వచ్చిన ఆగని దందా**

పత్రికలో గత రెండు రోజుల నుండి ఈ గలీజ్ దందాపై కథనాలు వచ్చిన వ్యభిచారం దందా మాత్రం ఆగడం లేదు. యువతులు రావడం.. హాస్టల్ ముందు ఉంటూ విటులను ఆకర్షిస్తూ దందా యధావిధిగా కొనసాగిస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**చర్యలు తీసుకోండి సార్ అంటూ పోలీసులను వేడుకుంటున్న స్థానికులు**

ఉమా నగర్ లో సాగుతున్న వ్యభిచార దందాపై చర్యలు తీసుకోవాలి అంటూ ఆ ప్రాంత ప్రజలు పోలీసు అధికారులను వేడుకుంటున్నారు. వీరి వెకిలి చేష్టల వల్ల ఆ ప్రాంత ఆడ పిల్లలను బయటకు పంపాలంటేనే భయపడాల్సిన పరిస్థితి వస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విటుల కోసం యువతులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ ఈ ప్రాంతంలో న్యూసెన్స్ చేస్తున్నారని, దీంతోపాటు వీటిల కోసం వీరు చేసే వెకిలి చేష్టల వల్ల ఈ ప్రాంతంలో ఉండలేకపోతున్నామని ఉమా నగర్ ప్రజలు వాపోతున్నారు. పోలీస్ అధికారులు వెంటనే స్పందించి ఈ దందాను ఇక్కడి నుంచి తరలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎంఎంసీ నూతన భవన శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించిన ఎంఎంసి కమిషనర్




సికింద్రాబాద్, జూన్ 5 (మనం న్యూస్) మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) నూతన ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి జూన్ 7న శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఉప్పల్ భగాయత్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కార్యక్రమ స్థలాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జోనల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు, వాటర్వర్క్స్ శాఖ ప్రతినిధులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వేదిక నిర్మాణం, అతిథుల కూర్చునే సదుపాయాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను పరిశీలించిన కమిషనర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను సూచించారు. ఈ సమీక్షలో జోనల్ కమిషనర్లు రాధిక గుప్తా, సంచిత్ గంగ్వార్, వికాస్ మహతో, అదనపు కమిషనర్లు రఘు ప్రసాద్, వేణుగోపాల్, చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి, డైరెక్టర్ సునంద, ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈలు రోహిణి, రమేష్బాబు, పీడీ సురేష్కుమార్, డిప్యూటీ డైరెక్టర్లు శ్రీనివాస్రెడ్డి, మాధవరెడ్డి, బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ శైలజతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## రైతులకు కన్నీరు మిగిల్చిన అకాల వర్షం

**అకాల వర్షంతో తడిసి ముద్దైన ధాన్యం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతన్నల డిమాండ్**





మేడ్చల్, జూన్ 5 ( మనం జిల్లా ప్రతినిధి):ల మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి గ్రామ పరిధిలో కురిసిన అకాల వర్షం రైతన్నలకు కన్నీరును మిగిల్చింది. వర్షంతో దాన్యమంతా తడిసి ముద్దయింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉద్దమర్రి గ్రామం పరిసర ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మూడుచింతలపల్లి మండల పరిధిలో కురిసిన అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసి బూజు, మొలకలు వచ్చి నష్టపోతున్నట్లు తెలిపారు.దాదాపు 20 రోజులుగా ఐకేపీ కేంద్రాల్లో ధాన్యాన్ని కుప్పలుగా పోసి కొనుగోలు కోసం ఎదురుచూస్తున్నామని, వర్షం పడితే తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టడమే తమ పనిగా మారిందని రైతులు వాపోయారు. మరోవైపు పాఠశాలలు ప్రారంభమయ్యే సమయం దగ్గరపడుతున్నప్పటికీ పాఠశాల ఆవరణల్లో పోసిన ధాన్యం కుప్పలు అలాగే ఉండిపోయాయని పేర్కొన్నారు.

అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఒక్కో అధికారి ఒక్కో విధంగా సమాధానం చెబుతూ కాలయాపన చేస్తున్నారని రైతులు ఆరోపించారు. తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

**పూడూరు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల ఆందోళన**

మేడ్చల్ జిల్లా పూడూరు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆందోళనకు దిగారు. 40 కిలోల బస్తకు అదనంగా మూడున్నర కిలోలు ఇవ్వాలంటూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పట్టు పట్టడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కష్టించి పండించిన ధాన్యాన్ని అధికారులు దోచుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యం: తలసాని

**పద్మారావునగర్లో 10 వేల లీటర్ల సామర్థ్యమున్న వాటర్ ట్యాంకర్ ప్రారంభం..**



సికింద్రాబాద్, జూన్ 5 (మనం న్యూస్) ప్రజలకు కనీస అవసరమైన త్రాగునీటిని అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. శుక్రవారం పద్మారావునగర్లోని బిల్వర్డ్ అపార్ట్మెంట్ వద్ద 10 వేల లీటర్ల సామర్థ్యమున్న వాటర్ ట్యాంకర్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరంలోని పలు ప్రాంతాల్లో నల్లాల ద్వారా సక్రమంగా నీటి సరఫరా జరగకపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో పూర్తిగా నీరు అందకపోవడంతో ప్రజలు ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క పద్మారావునగర్ ప్రాంతంలోనే రోజుకు సుమారు 200 నీటి ట్యాంకర్లు బుక్ అవుతున్నాయని, దీన్ని బట్టి నీటి సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చన్నారు. నీటి ట్యాంకర్ను బుక్ చేసిన తర్వాత కూడా వారం రోజుల పాటు వేచి చూడాల్సి వస్తోందని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు తమ రోజువారీ అవసరాలు ఎలా తీర్చుకోవాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్ల కాలంలో ప్రజలు త్రాగునీటి కోసం ఇబ్బందులు పడిన సందర్భాలు లేవని ఆయన పేర్కొన్నారు. పద్మారావునగర్ ప్రాంతంలో అపార్ట్మెంట్ల సంఖ్య అధికంగా ఉండటంతో జనాభా కూడా ఎక్కువగా ఉందని, ప్రస్తుతం వాటర్ వర్క్స్ శాఖ 5 వేల లీటర్ల సామర్థ్యమున్న ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ అది సరిపోవడం లేదన్నారు. దీంతో వాటర్ వర్క్స్ ఎండీతో మాట్లాడి 10 వేల లీటర్ల సామర్థ్యమున్న అదనపు ట్యాంకర్ను మంజూరు చేయించామని తెలిపారు. తమ త్రాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సీజీఎం వినోద్, పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇన్చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, బిల్వర్డ్ అపార్ట్మెంట్ ప్రతినిధులు జగ్గయ్య ముకుంద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.